ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 51 అక్టోబర్ 2018 సంచిక : 10

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 51 అక్టోబర్ 2018 సంచిక : 10

విషయ సూచిక

ముఖచిత్రం

చదువుల తల్లి సరస్వతీ దేవి

2-10-2018 గాంధీ జయంతి. 15-10-2018 సరస్వతీ పూజ


17-10-2018 దుర్గాష్టమి. 18-10-2018 విజయదశమి

ప్రార్థన

– శ్రీ మహావిష్ణుకృత సరస్వతీ స్తవము

1 ఓం స్వప్రకాశ నిఖిలావభాసినే
చిన్మయీ త్రిగుణ కార్యకారిణీ ।
భేదలక్షణ వినాశనక్షమా
శారదా వసతు మే హృదంబుజే ॥
2. ఓం విశ్వచక్రమఖిలం తనోతి యా
త్రిత్రిభేద నియమాత్ స్థితిఇచ్ఛ యా ।
సంహృతిం తు తదనుక్రమాచ్ఛ సా
శారదా వసతు మే హృదంబుజే ॥
3. ఓం సూర్యచంద్రశిఖి మధ్య సంస్థితా
యా ప్రకాశయతి లోక సంచయమ్ ।
యా విభాత్యఖిలనామరూపతః
శారదా వసతు మే హృదంబుజే ॥
4. ఓం యా కరోతి పచనం శరీరిణాం
భుక్తమన్నమఖిలం హవిర్భుజా।
యా ద్వితీయరహితా పరాత్పరా
శారదా వసతు మే హృదంబుజే ॥
5. ఓం యా విడంబయతి భూతపంచకం
లీలయాంతర విలీనమంజసా ।
తత్త్వజాలమఖిలం తనోతి యా
శారదా వసతు మే హృదంబుజే ॥
6. ఓం కాలకర్మ శశిభాను శంకరాం
భోజజాత హరివహ్ని భేదతః ।
తత్తదాకృతిమయీ విభాతి యా
శారదా వసతు మే హృదంబుజే ॥
7. ఓం స్వప్రకాశమతిరేకికా తనుః
సర్గపూర్వమఖిలాత్మకా స్థితా ।
యా వ్యుపాధి రహితా విభూతి సా
శారదా వసతు మే హృదంబుజే ॥
8. ఓం యా మునీంద్ర సురబృంద సేవితా
వేదబృంద పరిభావితాద్వయా ।
వాఙ్మనో విషయ భావనాతిగా
శారదా వసతు మే హృదంబుజే ॥

ఇతి నారాయణః స్తుత్వా శ్రీమాన్ భక్త్యా సరస్వతీమ్ ।
తదాజ్ఞయా స్వకం స్థానం యయౌ సంతుష్టమానసః ॥



బరువును తగ్గించుకొనుము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శిరస్సుపైగల కట్టెల మోపు బరువు ఎంతెంత తగ్గుచుండునో మోయువానికి అంతంత ఆనందము కలుగుచుండును. దృశ్య వస్తువులు బరువువంటివి. అవి ఎంతెంత తగ్గుచుండునో జీవునకు అంతంత శాంతి, సౌఖ్యము గలుగుచుండును. శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, అహంకారము, బాహ్య వస్తువులు, బంధుజాలము మొదలైన వన్నియు దృశ్య పదార్థముల క్రిందనే జమకట్టబడవలసి యుండునని గీతాచార్యులు ప్రవచించి వాటన్నిటికిని క్షేత్రమను పదము నొసంగెను. జీవుడు క్షేత్రము కాదు, క్షేత్రజ్ఞుడు. వాస్తవముగ శరీరముతోగాని, శరీర సంబంధములైన ఇతర పదార్థములతో గాని, వ్యక్తులతోగాని జీవున కెలాంటి సంబంధము లేదు. నాటక దీపమునకు నాటకముతో గాని, పాత్రధారులతో గాని, దర్శకులతో గాని, అచట క్రియాకలాపములతోగాని ఏ విధమైన సంబంధము ఎట్లు ఉండదో, అట్లే జీవునకును ఈ దృశ్యసంబంధమైన వస్తుజాలముతో ఏవిధమైన సంబంధమున్ను లేదు.

కాని అజ్ఞానవశమున ఆ దృశ్యజాలమంతయును తన నెత్తిన వేసికొని, ఆయా వస్తువులపై, బంధ్వాదులపై మమత్వమును పెంచుకొని, అవి యన్నియు తనవని భావించి సంసారరూప మహాసాగరమున ప్రవేశించుచున్నాడు. గాఢ నిద్రయందు ఏవిషయముతోను సంబంధము లేని సమయమున జీవుడు అపరిమిత అవిచ్ఛిన్న సుఖము ననుభవించుచున్నాడు. మేల్కొనికూడ అట్టి అవిచ్ఛిన్న సుఖము ఏల అనుభవింపరాదు? ఆత్మయందు ఒక్క క్షణకాలమైనను మనస్సు నిలకడ కలిగియున్నచో ఇంద్రసుఖము కూడ అల్పముగా తోచునంతటి పరమానందము జీవునకు

లభించునని శాస్త్రములు వక్కాణించుచున్నవి. శ్రీకృష్ణపరమాత్మయు అట్టి ఆనందస్థితిని పరమ లాభముగా వర్ణించెను. దృశ్యమును ఎంతెంత తగ్గించు కొనుచువచ్చిన అంతంత సుఖము మనుజునకు కలుగుచుండును. కాని జనులట్లు కావించుటలేదు. దృశ్య వస్తువులను రోజురోజునకు పెంచు కొనుచు, ప్రాపంచిక పదార్థములను కోకొల్లలుగ చేరదీసికొనుచు, వాటిపై మమత్వమును కల్పించుకొనుచు, తత్సంబంధములైన సంకల్పములతో రోజంతయు సతమతమగుచు, దైవధ్యానమునకు రవ్వంతైనను తీరిక లేక నానా యాతనలను అనుభవించుచున్నారు.

ప్రయాణము చేయువారికి వెంటనుండు సామాను ఎంత తగ్గిన అంత మంచిది. అది ఎంతెంత తగ్గునో ప్రయాణము అంతంత ఉల్లాసముగ నుండును. కనుకనే రైల్వే అధికారులు **Less luggage** (సామాను తగ్గించండి) అని ప్రయాణికులను హెచ్చరిక చేయుచున్నారు. జీవితము ఒక మహాప్రయాణము. ఇది ఎప్పుడు ప్రారంభమైనదో ఎవరికిని తెలియదు. మోక్షధామమును చేరుటకై అనాది కాలమునుండి జీవుడు ప్రారంభించిన ఈ ప్రయాణమునందు బరువు పెంచుకొనుట విజ్ఞులకు పాడికాదు. కుటుంబమును పరిమితముగ నుంచుకొని, వ్యవహారములను అతిగ పెంచుకొనక, అత్యవసరమైన ఏ కొద్ది కార్యక్రమములను మాత్రమే అమలు పఱచుకొనుచు, ఆత్మ విచారణకు, దైవధ్యానాదులకు, సత్కర్మానుష్ఠానమునకు సమయమును ఎక్కువగ వినియోగించుచుండినచో అచిర కాలములోనే జీవునకు పరమశాంతి లభించగలదు.

ఒక ఊరిలో ఒక మధ్యతరగతి వ్యక్తిగలడు. అతనికి ఐదుమంది కుమారులు, పదిమంది కుమార్తెలు కలరు. వారందరిని పోషించలేక, వారికి చదువులు చెప్పించలేక, వారి అవసరములను తీర్చలేక అతడు తికమక పడుచుండెను. పిల్లలకు యుక్తవయస్సు వచ్చినపుడు వారలకు వివాహము చేయవలసి వచ్చుటచే నానాయాతనలను ఎదుర్కొనుచుండెను. ఒకనాడు అతనికి విసుగు పుట్టి తన ఇంటికి ఒక బోర్డు వేలాడగట్టి దానిపై తన పేరు

వ్రాసి, ఆ పేరు చివర **F.F.S.F.T.D.** అను బిరుదును ఇంగ్లీషులో వ్రాయించెను. దారిన పోవు మనుష్యులందఱును ఆ బిరుదును చదువుకొని ఈతడు ఏ పశ్చిమ దేశములో గొప్ప విద్య నభ్యసించి బ్రహ్మాండమైన బిరుదును సంపాదించెనని అత్యాశ్చర్యమును పొందుచుండిరి. ఆ బిరుదును చదివిన ఒక కాలేజి విద్యార్థికి దాని అర్థమేమియో తెలిసికొనవలెనని కుతూహలము కలిగి ఒకనాడతని యొద్దకు వెళ్ళి మహానుభావా! మీరు ఏ విశ్వవిద్యాలయములో విద్య నభ్యసించిరి! మీ పేరు చివరగల ఆ డిగ్రీ యొక్క అర్థమేమి? అని ప్రశ్నింప ఆ యింటి యజమాని ఈ ప్రకారముగ దాని వివరణమును తెలియ జేసెను.

F.F.S. అనగా **Father of Five Sons** ఐదు మంది కొడుకుల తండ్రిని.

F.T.D. అనగా **Father of Ten Daughters** పదిమంది కూతుళ్ళ తండ్రిని. అనగా నాకు ఐదుమంది కొమారులు, పదిమంది కొమార్తెలు కలరు.

ఆ అర్థమును తెలిసికొనిన విద్యార్థి ఈ భాగ్యానికి దానిని బోర్డుపై వ్రాసికోవలెనా అని ప్రశ్నింప ఆ గృహస్థుడు 'నా బాధలు అందఱును తెలిసికొనుట మంచిదని భావించి ఆ ప్రకారముగా వ్రాసితిని' అని బదులు చెప్పెను.

భగవంతుని ఆశ్రయించి, స్వస్వరూపమైన ఆత్మను తెలిసికొని పరమానందమయముగ ఉండవలసిన జీవితములను ఇవ్విధముగ దృశ్య వస్తువులను పెంచుకొని, భారమును ద్విగుణీకృత మొనర్చుకొని సంసార మహాసముద్రమున ముక్కు వరకు మునిగి ఇడుములపాలగుట సముచితమా? కాబట్టి ప్రతి వ్యవహారమందును ఒక పరిమితిని అవలంబించి, దృశ్యమును పెంచుకొనక, దృశ్యవ్యామోహమందు తగుల్కొనక శాశ్వత పరమాత్మయే జీవిత లక్ష్యమని తెలిసికొని లక్ష్యసాధనకై తీవ్రతర కృషి యొనర్చుచు మానవ జన్మను కడతేర్చుకొనవలెను.



సద్గురు వాణి

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

నిర్హేతుకముగ యొకనిని ద్వేషించిన తన పుణ్యము వానికిపోయి, వాని పాపము తనకు వచ్చిచేరును. కావున యేప్రాణి యెడలను వైరములేక యుండవలయును.

* * *

పాషాణాదులను పుటముపెట్టి శుద్ధముచేసి కొన్ని మందులను తయారుచేసి వాటిచే ఎట్లు వ్యాధులను నివారించుచున్నారో అట్లే విషయ దోషముగల చిత్తమును జ్ఞానాగ్నియందు పుటమొనర్చినచో తద్గత మాలిన్యము –దోషమునుండి శుద్ధమై దారుణ భవరోగమును త్రుటిలో నిర్మూలించ గలుగును.

* * *

ప్రకృతి జయము గలుగవలసియుండిన సోమరితనము, అజాగ్రత అనునవి తన శరీరమున గల ఏ రోమకూపమునందైనను దాగియుండుట కవకాశము గలుగజేయరాదు.

* * *

సోదరా? మానవసేవ జేయుట మనుజునికి శ్రేష్ఠధర్మము. అయితే మానవసేవ చేయుటకు ముందుగా నీవు నీ మానససేవ చక్కగ చేయుము. అట్లైనమాత్రమే నీవు మానవసేవ సరిగా చేయగలవు.

* * *

నీ ప్రవర్తనలో ఇసుకరేణువంత పాపమున కీ దినము అవకాశము ఇచ్చినచో రేపటి కదియే మహామేరువంత యగును.

* * *

దీపమునకు, తైలమునకు ఎంత సంబంధమున్నదో ఆహారమునకు, బ్రహ్మచర్యమునకును అంత సంబంధము గలదు.

ఏ కార్యము చేయుటవలన జీవులకు సుఖము, శాంతియు గల్గునో ఆ కార్యమును బ్రతికియున్నంత వఱకు చేయవలయును.

మంత్రసిద్ధి, గ్రంథసిద్ధి మున్నగునవి జ్ఞానమున కుపకరించును. ఏదేని మంత్రము సిద్ధించినచో – దాని ప్రభావముచే వారు కొన్ని గొప్ప కార్యములను చేయగల్గుదురు. ఒక మంత్రమున సిద్ధి బొందిన వారు దాని నితరుల కుపదేశించిన వారికి త్వరలో సిద్ధియగును.

* * *

పురోభివృద్ధిని గోరువారు పూర్వవృత్తాంతమును మరువగూడదు.

* * *

ఓ సాధకులారా ! మీరు ఏ జాతిలో జన్మించినను, ఏ మతములో యుండినను, ఏ ఆశ్రమస్థులైనను, మీరు స్త్రీలైనను, లేక పురుషులైనను, ఎట్టి స్థితియందున్ననూ దైవీగుణముల నలవరచుకొనుచుండిన ఈశ్వర కృపకు పాత్రులుగాగలరు. ఇది ముమ్మాటికి నిజము.

* * *

నివసించు స్థలము, ధరించు వస్త్రము, ఉపయోగించుకొను పాత్ర, భుజించు ఆహారము, ఆ యాహారమును సంపాదించు మార్గము అనునవి శుద్ధముగ నుండవలయును. ఈ పంచశీలములను సాధకుడు ఎప్పుడును వదలరాదు.

* * *

యుక్తాహారము, వివిక్త (ఏకాంత) వాసము. బ్రహ్మచింతనము అను ఈ రత్నత్రయమును శరీరపతన పర్యన్తము విడువరాదు.

1. బైట వస్తువులు పెరగడం కాదు లోపలి వాసనలు తరగాలి. అప్పుడే శాన్తి.

2. నిప్పును తాకి (సోకి) జొన్నగింజ తెల్లనౌతుంది (పేలాలు). సాధు సాంగత్యంలో పాపి కూడా పరిశుద్ధుడౌతాడు.

3. సైంటిస్టులు బయట (ప్రపంచాన్ని) బాగు చేయాలంటారు. సాధువులు లోపల (మనస్సును) బాగు చేయాలంటారు. – పూజ్యశ్రీ రామకృష్ణానందస్వాములవారు (గండిక్షేత్రం)



ఇష్టనిష్ఠ

– శ్రీ రామకృష్ణ పరమహంస

కుటుంబంలో ఆత్తమామలపట్ల కోడలు విధేయురాలై వారిని గౌరవిస్తూ వారికి సేవలు చేస్తూంటుంది. వారిని ఎన్నడూ నిరసించదు, వారి మాటను జవదాటదు. ఐనా తన భర్తని అందరికంటె ఎక్కువగా ప్రేమిస్తుంది. అలాగే నీ ఇష్టదైవంపట్ల భక్తిశ్రద్ధలు వహించు, కాని ఇతర దేవతలను నిరసించకు. వారినీ పూజించు. సమస్త దేవతలు ప్రేమమూర్తి ఐన పరమేశ్వరుని రూపాలేకదా !

అష్టకాష్ఠమనే ఆటలో పాచికలు అన్ని గదులను దాటిపోయి, తిరిగిరాకుండ నడిమి గదిని చేరి పండాలి. నడిమి గదిని చేరేవరకు ఏ పాచిక ఐనా ప్రారంభించిన చోటికే మళ్లా మళ్లా పోతూ చాలసార్లు పాడిన పాటనే పాడవలసి వస్తుంది. కాని రెండు పాచికలు జంటగా ఒక గది నుంచి మరోగదికి పోతూండేటప్పుడు, ఏ ఆటగాడూ వాటిని వెనక్కు నెట్టివెయ్యలేదు. అలాగే లోకం (అనే ఆటపాళి)లో ఆధ్యాత్మిక యాత్ర సాగించేవారు గురువును, ఇష్టదైవాన్ని శరణుజొస్తే మార్గంలో అవరోధాలను, బాధలను గురించి భయపడవలసిన పనిలేదు. వారి పురోగమనం సరళంగా, నిరాటంకంగా సాగుతుంది.

కలకత్తాకు వెళ్లే మార్గాలు అనేకం వున్నాయి. సంశయశర్మ అనే వ్యక్తి కలకత్తాకు పోవాలని దూరంలోని తన ఊరినుంచి బైలుదేరాడు. దార్లో అతడు “నేను శీఘ్రంగా కలకత్తా చేరే మార్గమేది?” అని ఒకణ్ణి అడగ్గా అతగాడు, “ఇదిగో, యీ మార్గాన్నిబట్టి పో” అన్నాడు. ఆ దారిలో కొంతదూరం వెళ్లాక సంశయశర్మ మరొకణ్ణి చూసి “కలకత్తాకు దగ్గరి దారి యిదేనా?” అని అడిగాడు. ఆ వ్యక్తి “అబ్బే! యిది కాదు, వెనక్కు మరలి ఎడమచేతి వైపున్న దారిగుండా పోవాలి” అన్నాడు. ఆ మార్గాన్ని బట్టి కొంతదూరం వెళ్ళి సంశయశర్మ మళ్లా మరోవ్యక్తిని చూసి తోవ అడిగాడు. అతడు మరో దారి చూపించాడు. ఇలా పదేపదే తోవలను మార్చుకొంటూ సంశయ శర్మ పొద్దుగూకే వరకు నడక సాగించాడు. కాని బైలుదేరిన చోటునుంచి ఎంతోదూరం పోలేదు. నిజంగా కలకత్తాకు పోదలచినవాడు నమ్మదగిన ఒకడు చూపినదేదో ఒకే మార్గాన్నిబట్టి పోవాలి. అలాగే భగవంతుణ్ణి ప్రాపింపగోరేవాడు ఉత్తముడైన ఫలానా గురువును ఆశ్రయించి అతడు చూపే మార్గాన్ని శ్రద్ధాభక్తులతో అనుసరించాలి.

ఒకడు నుయ్యి తవ్వనారంభించాడు. నాలుగైదు బారలలోతు తవ్వి నీరు పడక మరోచోటు నిర్ణయించి అక్కడ యింకా లోతుగా తవ్వాడు. కాని అక్కడా నీరు పడకపోవడంతో మరో తావును నిర్ణయించి అక్కడా మరింత లోతుగా తవ్వాడు. కాని ఫలం కలుగలేదు. చివరకు విసిగి వేసారి ఆ పనినే విడిచిపెట్టేశాడు. ఈ మూడు నూతుల లోతూ కలిపి పాతిక బారలకు కాస్త తక్కువగా వుంటుంది. ఒకచోటు విడిచి మరోచోట తవ్వనారంభించటానికి బదులు తాను పడ్డ శ్రమలో సగమైనా ఓపికతో మొదటి నూతికే వినియోగించివుంటే అతడికి నీరు లభించేది. ఈ మతం కాదని ఆ మతం, ఆ మతం కాదని మరోమతం – యీ విధంగా మతధర్మాలను ఊరక మార్చుకొనేవారి విషయంకూడ యిలాంటిదే. ఏదైనా ఒక్క మతాన్ని నమ్ముకొని దాన్నే శ్రద్ధాభక్తులతో సాధన చేస్తే విజయం తప్పక చేకూరుతుంది.

పతివ్రత ఐన స్త్రీకి జన్మజన్మాంతరాల్లో సైతం భర్తతో ఎడబాటు వుండదు. అలాగే ఇష్టదైవంపట్ల శ్రద్ధాభక్తులున్నవాడు నిశ్చయంగా భగవంతుడిలో ఐక్యం పొందుతాడు.



రాజయోగం - ఆరు పాఠాలు

పాఠం - 4

- శ్రీ స్వామి వివేకానంద

మనం మనస్సును నిరోధించటానికి ముందు, దాన్ని పరీక్షించాలి. మనసు చంచలమైనది. దీన్ని పట్టుకుని చలింపకుండా ఒకే భావంలో నిలపాలి. ఇలా నిరంతరం చేయాలి. ఇచ్ఛాశక్తి వల్ల మనసును నిగ్రహించి, ఈశ్వరునిలో నిలిపి ఉంచగలుగుతాం.

మనసును నిగ్రహించటానికి చాలా తేలికమార్గం ఒకటుంది. శాంతంగా కూర్చో. మనసును దానిష్టం వచ్చినట్లు కొంతసేపు పోనిమ్ము. “ఈ మనసు తిరుగుతుంటే, దాన్ని చూస్తూ నిలిచిన సాక్షిని నేను, నే నీ మనసును కాను ” అని గాఢంగా భావించు. ఆ తర్వాత ఆ మనసు నీకన్నా వేరని, నువ్వు దాన్ని చూస్తున్నట్లు అనుకో! నువ్వు పరమాత్మవనుకో. శరీరం కానీ, మనసుకానీ నీకన్నా వేరని భావించు.

మనసు ఒక శాంతమైన సరస్సులా నీ ఎదుట ఉన్నట్లు ఆ మనసులో ఉదయించే వృత్తులు ఆ సరస్సులో లేచిపడే బుడగల లాంటివని భావించు. ఆ వృత్తులను నిరోధించటానికి ప్రయత్నించకు. వాటి పుట్టుక – విలీనాలను ఊరక సాక్షీభూతుడవై చూస్తూ ఉండు. చాలు. ఇలా చేస్తే క్రమంగా వృత్తులు అణిగిపోతాయి. సరస్సులో ఒకరాయి విసరితే తరంగాలు పుట్టి క్రమంగా విశాలంగా వ్యాపించిపోతాయి. కాబట్టి మనోతరంగాలను నిరోధించాలంటే, వాటిలో పెద్ద తరంగాన్ని తీసుకుని దాన్ని క్రమంగా సంకుచితం చేస్తూ, చివరికి దాన్ని బిందుమాత్రంగా చేసి, అక్కడ మనస్సునంతా కేంద్రీకరించి నిలపాలి. “నేను మనసును కాను, మానసిక యోచనను గమనించేవాడిని, నేను సాక్షీభూతుడను” అని తెలుసుకోవాలి. అంటే “ఆలోచించటాన్ని నేను

చూస్తున్నాను. ఆ మనసు పని చేస్తుండగా నేను చూస్తున్నాను” అని నిరంతరం తలంచాలి. కాలక్రమంలో అనుభవంతో మనోవృత్తులతో నీకు అభేదభావం తగ్గిపోతుంది. చివరికి నువ్వు వేరని, మనస్సు ఒక సాధన మాత్రమేనని, అదీ నీకన్నా వేరని తెలుసుకుంటావు.

ఈ భిన్నత్వాన్ని సాధించిన తర్వాత మనసు నీకు వశమవుతుంది. దాన్ని నువ్వు సేవకునిలా నీ యిష్టం వచ్చినట్లు నిరోధించవచ్చు. యోగి కావటానికి ఇంద్రియాలను దాటటం మొదటి లక్షణం. మనసును జయించిన తర్వాత యోగి ఉన్నత స్థితిని పొందినట్లు గ్రహించాలి.

సాధ్యమైనంతవరకూ ఏకాంతంగా ఉండాలి. ఆసనం తగినంత ఎత్తుగా ఉండాలి. దానిపైన దర్భాసనం, దానిపైన మృగాజినం – దానిపైన పట్టుబట్ట. పీఠానికి ఆనుకునే బల్ల ఉండవద్దు. అది స్థిరంగా ఉండాలి.

వృత్తులు బొమ్మల్లాంటివి. కాబట్టి వాటిని మనం కల్పించుకోరాదు. మనం చేయవలసినదెల్లా మనసునుండి వృత్తులను తొలగించుట మాత్రమే. మనసును వృత్తిరహితం చేయాలి. వృత్తి పుట్టగానే దాన్ని త్రోసివేయాలి. ఈ ఫలితాన్ని సాధించటానికి మనం విషయాలను నిరసించి, శరీర భావాన్ని దాటివేయాలి. ఈ ప్రయత్నాన్ని చేయటానికి మాత్రమే మానవ జీవితం ఉంది.

ప్రతి ధ్వనికీ ఏదో ఒక అర్థం ఉంటుంది. శబ్దార్థాలు రెండూ మన స్వభావంలోనే సంబద్ధాలై ఉన్నాయి.

మన చరమలక్ష్యం పరమాత్మ. కాబట్టి పరమాత్మపై ధ్యానం చేయాలి. మనం అతణ్ణి తెలుసుకోలేం. ఎందుకంటారా? సర్వానికి సాక్షీభూతం ఆత్మ. అది సర్వాన్ని తెలుసుకుంటుందే తప్ప, దాన్ని ఏదీ తెలుసుకోలేదు. అయితే మనం ఆత్మస్వరూపులమే.

మనం పాపాన్ని దర్శిస్తే, దాన్ని సృష్టిస్తున్నామన్నమాట. మనం ఆ వస్తువును చూడటానికి ముందు, మనం అది అయ్యితీరాలి. అది మనమైనప్పుడే, దాన్ని మనం బయట చూస్తాం. ఎందుకంటే, లోకం ఒక అద్దం లాంటిది. మనం అందులో చూచేది ప్రతిబింబాన్ని మాత్రమే. ఈ శరీరం మనం కల్పించుకున్న చిన్న అద్దం. కాని మొత్తం విశ్వమంతా మన శరీరమే. మనం ఎప్పుడూ ఈ భావన చేస్తుండాలి. అప్పుడు మనం చచ్చిపోమని, మరొకని చంపమని, ఏ వస్తువూ మనకన్నా భిన్నం కాదని మనకు తెలుస్తుంది. మనకు జనన మరణాలు లేవు. మనం చేయవలసిందెల్లా అన్నింట్లో ప్రేమభావం కలిగి ఉండటమే.

"ఈ సర్వవిశ్వం నా శరీరం. ఈ విశ్వంలో నున్న సుఖసంతోషాలన్నీ – ఉత్సాహమంతా – ఆరోగ్యమంతా నాదే. నేనే ఈ విశ్వాన్ని" అని భావించు. చివరికి ఈ విశ్వంలో ప్రతిఫలిస్తున్న క్రియ అంతా మన నుండే పుడుతున్నదని మనం తెలుసుకుంటాం. మనం పరమాత్మ అనే సముద్రంలో లేచే చిన్నచిన్న కెరటాలవంటి వారమైనా, మనకాధారభూతంగా ఉంది మాత్రం సముద్రమే. ఆ మహాసముద్రానికి మనం వేరుగా లేము. ఏ కెరటం కూడా దానికి వేరుగా ఉండదు.

చక్కగా ఉపయోగిస్తే, భావన మనకు ఎంతో మంచి ఉపకారం చేస్తుంది. అది బుద్ధిని దాటి మనల్ని కావలసిన చోటికి కొనిపోయే వెలుగు వంటిది. ఆత్మానుభూతి మనలోనే ఉంది. దాన్ని సాధించటానికి మన చేతిలో ఉన్న శక్తులను మనం ఉపయోగించుకోవాలి.

విజయదశమి శుభాకాంక్షలు

వేదాన్తభేరి వ్యాస రచయితలకు, పాఠకులకు, పోషకులకు, ప్రపంచములోని ప్రాణులందరికి విజయదశమి శుభాకాంక్షలు.



మానవ జన్మ సార్థకత

– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

ధర్మార్థ కామ మోక్షములనెడు చతుర్విధ పురుషార్థములను సాధించుటయే మానవుని సామాన్య కర్తవ్యము. నాల్గవదైన మోక్షమును తెలిసికొనుటయే మానవ జన్మ ముఖ్య కర్తవ్యము. మోక్షమును సాధించుటయే మానవ జన్మ సార్థకత.

ధర్మమనగా వేదవిహిత కర్మ. మానవులు ఏ ఆశ్రమములో అనగా బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాస ఆశ్రమములలోనున్న వారు ఆయాశ్రమమునకు విధించిన కర్మములనాచరించుటయే ధర్మమన బడును.

గృహస్థాశ్రమములో నున్నవారు ప్రతిదినము 1). దైవారాధన, 2). విష్ణు, లలితా, శివస్తోత్ర పారాయణ, పురుష సూక్త, శ్రీసూక్త, నమక, చమక మొదలగు పారాయణలు. 3). తల్లిదండ్రులకు బాగుగా సేవ జేయుట. 4). అతిథులకు శక్త్యానుసారము భోజన సత్కార సేవలను జేయుట. 5). పశుపక్ష్యాదులు, చీమలు మొదలగు జంతువులకు తగు ఆహారాదులనొసగుట చేయవలెను. వీటినే దైవయజ్ఞము, ఋషియజ్ఞము, పితృ యజ్ఞము, అతిథి యజ్ఞము, భూతయజ్ఞములను పంచయజ్ఞములందురు. వీటినాచరించుట వలన సామాన్య దోషముల నివారణ జరుగును.

బ్రహ్మచర్యాశ్రమములోనున్న వారు వేదవేదాన్తాధ్యయనము, ప్రాతస్సాయంకాలములందు అగ్నిహోత్రము, గురుసేవ, గాయత్రీమంత్ర

జపము మున్నగునవి ఆచరింపవలెను.

వానప్రస్థాశ్రమము –50, లేక 60 సంవత్సరములు గడచిన తరువాత, పుత్రులకు గృహబాధ్యతల నప్పగించి ఉన్న ధనాదులచే తృప్తిపొంది, దైవారాధన, ఆత్మజ్ఞాన సంబంధములగు భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు వాటిని శ్రవణ, మనన, ధ్యాసనాదులను గావించి జ్ఞానమునార్జించి ముక్తిని పొందవలెను.

సంన్యాసాశ్రమము – మూడాశ్రమములలో నున్న వారెవరైనను, వైరాగ్యమును సంపాదించినట్లయితే కేవల మోక్షమును గోరిన వారైతే వారందరూ సంన్యాసమును స్వీకరింపవచ్చును. "యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్" అని శాస్త్ర వచనము.

నాల్గాశ్రమములోనున్న వారెవరైనను ఆత్మజ్ఞాన విచారణ ద్వారా ముక్తిని పొందుటకర్హులే. మానవమాత్రునికి మోక్షమును పొందుటకు సమర్థత యున్నది.

ధర్మమునాచరించుచు, ధనాదులను సంపాదించి, ధర్మబద్ధములైన కామములను అనగా కోరికలను అనుభవిస్తూ, ముక్తికై జ్ఞానము నార్జించవలెను. అపుడే మానవ జన్మ ధన్యమగును.

మానవ జన్మను పొంది, ధర్మనిరతను, జ్ఞానసిద్ధిని సాధించనట్లయితే పశుతుల్యులగుదురు. ద్విపాద పశువులనబడుదురని శాస్త్రము, పెద్దల వాక్యము.

"ఆహార నిద్రాభయమైథునాని సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్।
జ్ఞానం హి తేషామధికో విశేషః, జ్ఞానేన హీనః పశుభిస్సమానః ॥"

అథవా "ధర్మేణ హీనః పశుభిస్సమానః "

భావము : ఆహారము, నిద్ర, భయము, మైథునము, వీటి యనుభవము, వీటిని సేవించుట మానవులకు, పశుపక్ష్యాదులకు సమానమే. ఆవులకు గడ్డి తినడమే మహానందము. మానవులకు మంచి రుచికరమైన భోజనమే మహానందము. మానవులకు ఏసి రూములు, మంచి పరుపులే ఆనందము. పందికి బురదలో నుండుటయే ఆనందము. దయామయుడైన ఒక యోగి బురదలో నుండే పందికి తన శక్తి ద్వారా దానికి మాటలాడే శక్తినిచ్చి నిన్ను వైకుంఠం తీసుకెళ్లి యచ్చట మంచి రూమ్ ఇప్పించెదను. నాతో రమ్మని చెప్పెను. ఆ పంది విని వైకుంఠంలో ఈ బురదగుంటలుంటాయా అని యోగినడిగెను. అచ్చటయుండవని యోగి చెప్పెను. ఈ బురద గుంటలలో నాకు కలిగే ఆనందము వైకుంఠంలో నుండునని నమ్మకం లేదు. కావున నేను వైకుంఠంనకు రాను అని చెప్పెను. ఈ విధముగా మిగతా మూటిని భావించవలెను.

సింహమున కుండే పరాక్రమము మానవునకు లేదు. దాని మీద ఎన్ని శస్త్ర అస్త్రములు వేసిన అది ముందుకే ప్రయాణం చేయును, వెనుకకు మరలదు.

జంతువులైన పశుపక్ష్యాదులకు క్రూరత్వాది బుద్ధిని మార్చుకొనే సామర్థ్యము లేదు. మానవులు రజోగుణ, తమోగుణాభ్యాస మాలిన్యముతో దుర్వ్యసనములకు లోనై దుష్ప్రవర్తన ననుసరించినవాడైనను సజ్జనుల సహవాసము చేతను సచ్ఛాస్త్ర పఠనములతో, సత్సంగముల ద్వారా చెడు ప్రవర్తనను వదలి మంచి మార్గములో ప్రవేశించే సామర్థ్యము ఒక్క మానవునకే యున్నది. **ఉదాహరణ:** వాల్మీకి మహర్షి ముందు రత్నాకరుడనే పేరు కలిగియుండెను. బాటసారుల నుండి అక్రమ ధనమును అపహరించి దొంగగా ప్రఖ్యాతిగాంచెను. నారద మహర్షి నీతిబోధచే దుష్ప్రవర్తన విడనాడి దివ్యమంత్ర జపంచేసి మహర్షిగా విఖ్యాతి గాంచెను. వారు రచించిన

రామాయణమునే వాల్మీకి రామాయణ మందురు. సామర్థ్యముండి మార్చుకొనని వాడు పశువుతో సమానమని భావన. మానవుడు మాధవుడు కావడము దానవుడు కావడము తన చేతిలోనే యున్నది. భగవంతుడు మానవునికి సర్వస్వతంత్రత నిచ్చియున్నాడు. ఈ విచక్షణా జ్ఞానాన్ని తెలుసుకొనుటయే మానవ ధర్మము.

పశుపక్ష్యాది జన్మలు, దేవతాది జన్మలు కేవలం భోగజీవులే కాని, యోగజీవులు కారు. ఆత్మజ్ఞాన సంపాదన కేవలం మానవ జన్మలోనే గలుగును.

"ఆత్మజ్ఞానవిహీనమూఢాః తే పచ్యన్తి నరకేనిగూఢాః" ఆత్మజ్ఞానము లేనివారు నరకమును పొందుదురని శాస్త్రము.

"ఇహ చేదవేదీదథ సత్యమస్తి, నచేదిహావేదీన్మహతీ వినష్టిః।
భూతేషుభూతేషు విచిన్త్యధీరాః ప్రేత్యాస్మాన్లో కాదమృతో భవన్తి" ॥

" ఇహ చేదశక్తోబోద్ధుం ప్రాక్ఛరీరస్య విస్రసః ।
తతస్సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే " ॥

ఈ భూలోకంలో ఆత్మజ్ఞానమును అనగా తన్ను తాను తెలిసికొనిన వాని జన్మమే జన్మము. అతడే అమృత స్వరూపుడగుచున్నాడు. ఈ దేహం విడచిపెట్టకముందే ఆత్మజ్ఞానము తెలిసికొనకపోతే పృథివ్యాది లోకముల యందు మాటిమాటికి పుట్టుచు చచ్చుచు సంసార బంధము నందు తగుల్కొనును. అటువంటి వారు ఆత్మహంతకులని ఈశావాస్యోప నిషత్ చెప్పుచున్నది. 'ఆత్మహనోజనాః' అని చెప్పుచున్నది. మానవ జన్మయే గొప్పది.

దుర్లభంత్రయమేవైతద్దైవానుగ్రహహైతుకమ్ ।

మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః ॥

అని ఈవిధంగా జగద్గురు శంకరాచార్యుల వారు వివేక చూడామణిలో చెప్పియున్నారు.

లోకములో నున్న జీవరాశులన్నిటి లోను మానవ జన్మయే అత్యంత శ్రేష్ఠమైనది. మానవునకు స్వభావాన్ని మార్చుకొని, స్వరూపాన్ని తెలుసుకొనే యోగ్యత యున్నది. పశుపక్ష్యాదులకు ఈ రెండును లేవు.

మానవులలో ముముక్షుత్వాన్ని పొందినవాడు గొప్ప శ్రేష్ఠుడు. మోక్షము కొరకు ప్రయత్నం చేయువారు మోక్షము కావాలని కోరువారెవరైన స్త్రీలు గాని, పురుషులు గాని, బ్రాహ్మణులు గాని, ఇతరులు గాని, వారందరూ ముముక్షువులనబడెదరు. చాలామంది జనులు, సేవలు, పూజలు, జపధ్యానములు, యజ్ఞములు వీటినే చేయుచుందురు. మోక్షసాధన అయిన ఆత్మానాత్మ విచారణ చేయరు. సత్సంగములలో పాల్గొనరు, ఆత్మకు సంబంధ గ్రంథములను చదవరు. పూజాదుల వలన కేవలము పుణ్యము వచ్చును. కాని మోక్షము రాదు. మోక్షసాధనకు యోగ్యమైన జ్ఞాన సంపాదనకు తగు అంతఃకరణ శుద్ధి గలుగును. ఆత్మవిచారణ ద్వారానే జ్ఞానము గలిగి మోక్షమును పొందెదరు.

ఈ మోక్ష విషయమును బాగుగా తెలుసుకొనుటకు మహాపురుషుల నాశ్రయించువారు అత్యంత మహాశ్రేష్ఠులు. మహాపురుషులనగా:శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, సాధన చతుష్టయ సంపన్నులు. వేదములను బాగుగా నధ్యయనము, చేసి, వేదార్థమును బాగుగా తెలుసుకొని స్వయముగా ఆచరించి, వేదములకాధారమైన వేదాన్త వాక్యములచే బుద్ధికి గోచరమైన పరబ్రహ్మము సర్వమునకాధారభూతమైనది, అందరియందు సమానముగా నున్నదని, తనయందు అదేగలదని నిశ్చయించి దానియందే నిష్ఠగలిగి

తాను ఆ పరబ్రహ్మమేనని దృఢాపరోక్ష జ్ఞానముగలవాడే బ్రహ్మనిష్ఠుడు. ఇటువంటి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠునాశ్రయించినవారు మానవులలో అత్యున్నోత్తములు. ఈ సాధకులు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుల ద్వారా తత్త్వమసీతి మహావాక్యములను శ్రవణం చేసి మనన నిదిధ్యాసులై తామును బ్రహ్మనిష్ఠులగుదురు. జనన మరణ రహితులై బ్రహ్మానందభరితులై జీవన్ముక్తులగుదురు. అప్పుడే మానవ జన్మ సార్థకత.

ఓం లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు. ఓం శాన్తిశ్శాన్తి శ్శాన్తిః.

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో - భాగవత సదస్సు

1. **21-10-2018 నుండి 27-10-2018 వరకు**
   పూజ్యశ్రీ స్వామిని శీలానందగారు (చిన్మయారణ్యం)
2. **26-11-2018 నుండి 2-12-2018 వరకు**
   పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వామీజీ(హైద్రాబాద్)
3. **16-12-2018 నుండి 22-12-2018 వరకు**
   పూజ్యశ్రీ పరావిద్యానంద స్వామిని గారు(యాచారం)
4. **16-1-2019 నుండి 22-1-2019 వరకు**
   పూజ్యశ్రీ శివానంద సరస్వతిస్వామిని గారు (చైతన్య తపోవనం)
5. **23-1-2019 నుండి 29-1-2019 వరకు**
   పూజ్యశ్రీ ప్రణవానంద స్వామీజీ (లత్తవరం)
6. **13-2-2019 నుండి 19-2-2019 వరకు**
   పూజ్యశ్రీ జ్యోతిర్మయానంద స్వామిని గారు (పాలకొల్లు)
7. **15-3-2019 నుండి 21-3-2019 వరకు**
   శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారు (కాళీవనాశ్రమము, నంబూరు)

ఇందులో పాల్గొనదలంచిన భక్తులు ఒక నెల ముందుగా జాబు వ్రాసి నివాస వసతికి అనుమతిని పొందవలెను.



బ్రహ్మకపాల తీర్థం - నిస్సంకల్పస్థితి

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

శ్రీ సద్గురుదేవులు తీవ్ర వైరాగ్యంతో బాల్యంలోనే గృహపరిత్యాగం చేశారు. కట్టుబట్టతో, కాలినడకతో అఖండ భారత భూమండలంలో తీర్థయాత్రలు కావించారు. కాలికి చెప్పులు గూడా లేకుండా 'పర్యటనం' చేశారు.

యాత్రాకాలంలో బ్రహ్మకపాల తీర్థం వెళ్ళారు. అక్కడ గతించిన పితరులకు పిండప్రదానాలు చేయడం సంప్రదాయం. స్వామి తీర్థాన్ని సమీపించేసరికి అక్కడి పురోహితులు సంకల్పం చెబుతామంటూ వారి చెంతకు వచ్చారు. అందుకు వారు "అయ్యలారా! నాకు కావలసింది నిస్సంకల్ప స్థితియే కాని సంకల్పం కాదు" అని సమాధానం చెప్పారు.

వారిలో ఒక వృద్ధ పురోహితుడు - "నాయనా! నీవు తపస్వివి. నేను నీకు నిస్సంకల్పస్థితి సిద్ధించు విధంగా సంకల్పం చెబుతాను" అని సమీపించాడు. అందుకు స్వామి "మీరు ఆచంద్రార్కం వంశాభివృద్ధిరస్తు! పుత్రపౌత్రాభివృద్ధిరస్తు" అని చెబుతారు. ఇది సిద్ధక్షేత్రం. మీరు చెప్పే సంకల్పం నెరవేరవచ్చు. నేను బ్రహ్మచారిని. నాకు అలా సంకల్పం చెప్ప గూడదు" అని అన్నారు.

అపుడు వృద్ధ పురోహితుడు "నాయనా! ఇది సిద్ధక్షేత్రమైనా ఆత్మశుద్ధి లేనివారి మాటలు ఫలించవు. ఇక్కడే కాదు, ఎక్కడా ఫలించవు" అని చెప్పాడు.

అంతట స్వామి సంతసించి ఆ వృద్ధుని ద్వారా పిండ తర్పణాలు

చేశారు. పిదప సంతాన హీనుల నుద్దేశించి వారికెవరూ తర్పణాలు చేసేవారు ఉండరు కాన వారికి గూడా తర్పణం చేయాలనుకొన్నారు.

"త్రిలోకాలలో సకలప్రాణులూ సర్వేశ్వరుని సంతానమే. ఆ నిశ్చయంతో అందరినీ ఉద్దేశించి చేసే తర్పణం బ్రహ్మతర్పణ మవుతుంది. మానవులే కాదు, పశు పక్ష్యాదులు గూడ పరబ్రహ్మగోత్ర సంభవులే. ఈ బదరీనాథ సిద్ధక్షేత్రమునందు బ్రహ్మ కపాలతీర్థములో నేనిచ్చే ఈ తర్పణం చరాచర ప్రాణికోట్ల కన్నిటికీ చెందుగాక!" అని ఏకాగ్ర భావంతో ఉచ్చైఃస్వరంతో పలుకుతూ స్వామి తర్పణమిచ్చారు.

అది విని అచ్చటి పురోహితులు, సాధువులు, యాత్రికులు స్వామి వైపు తదేక దృష్టితో చూచారు. వారిలా అనుకొన్నారు. "ఇదివరలో ఇట్టి విశ్వైక ప్రేమతో వసుధైకకుటుంబ భావంతో తర్పణం చేసినవారెవరూ లేరు. అలా చేసినవారిని కని విని ఎఱుగము" అని చెప్పుకొంటూ విస్మయానికి గురి అయ్యారు.

స్వామి గోగర్భ తపఃకాలం నుండీ గ్రంథాలలో తన పేరుపైన 'చరాచర సుఖాభిలాషి' అని వ్రాసేవారు. అందరినీ పరబ్రహ్మగోత్రంలో సంభవించిన వారినిగా భావించేవారు. అట్టి ఔదార్యమే వారిని సద్గురువుగా, మహర్షిగా సుప్రసిద్ధులను గావించింది.

రాత్రి అంతమై పగలు ప్రారంభమయ్యే సమయంలో వచ్చే సంధి కాలాన్ని ప్రాతః సంధ్య అంటారు. దీనికి బ్రహ్మ దేవుడు అధిపతి. అందువలననే దీన్ని బ్రహ్మ ముహూర్తం అంటారు. బ్రహ్మ ముహూర్తం తెల్లవారుజామున 3 గంటలకు ప్రారంభమై సూర్యోదయంతో అంతమవుతుంది. పగలు అంతమై రాత్రి ప్రారంభమయ్యే సంధి కాలాన్ని సాయం సంధ్య అంటారు. దీనికి విష్ణువు అదిదేవత. విష్ణు సహస్రనామ పారాయణకిది అనువైన సమయం.

ఉద్ధవ గీత – ఆత్మైవహి సద్గురుః

మూలం : **అనువాదం :**

శ్రీ వ్యాసమహర్షి **యేలేశ్వరపు హనుమరామకృష్ణ**

ఉద్ధవుడు:

శ్లో ॥ యేగేశ! యోగవిన్యాస! యోగాత్మన్! యోగసంభవ!
నిశ్శ్రేయసాయ మే ప్రోక్తః త్యాగః – సన్యాసలక్షణః ॥
(అధ్యా 7, శ్లో 14)

హే యోగీశ్వరా! యోగాధారా! మిమ్ములను ఆశ్రయించినట్టి మా వంటి ఆశ్రితుల క్షేమము కొరకై సన్యాసరూప త్యాగము గురించి ఉపదేశించండి. ఎందుకంటారా? సర్వాత్మకుడవగు నీ పట్ల పూర్ణభక్తిని మా బుద్ధి సంతరించుకోనంతవరకూ మేము మా దృశ్య విషయాభిలాషకు బద్ధులమై మా ఈ బ్రతుకులను కొనసాగిస్తూనే వుంటున్నాము. విషయాభిలాష ఉన్నంతవరకు దృశ్య విషయములపట్ల కోరికలను త్యజించలేము. కోరికలు కొనసాగుచున్నంత వరకు భగవత్ – విముఖత్వం వదలదు.

శ్లో ॥ సోఽహమ్ – మమాహమ్ ఇతి మూఢ మతిః విగాఢః
త్వన్మాయయా విరచితాత్మని సానుబంధే
తత్త్వంజసా నిగదితం భవతా యథా ఽహమ్
సంసాధయామి భగవన్ ! అనుశాధి భృత్యమ్ ॥ (అధ్యా 7,శ్లో 16)

స్వామీ ! నీ మాయచే రచించబడిన పుత్ర– మిత్ర– కళత్ర – ఇత్యాది విషయములపట్ల నేను నాది అనే గాఢమైన విమూఢత్వముచే మేము ఆవరించబడి, ఇరుక్కొని ఉన్నాము. అందుచేత నీవు ఇప్పుడు ఉపదేశించిన **"జగత్తును జయించటం – జీవాత్మను అధిగమించటం – పరమాత్మత్వము సంతరించుకోవటం"** అనే మార్గంలో మేము ప్రయాణించలేకపోతున్నాం. నేను దృశ్యములో మగ్నుడనై – మూఢుడనైన ఇక నాకు త్రోవ తెలియటం లేదు. ఈ ప్రాపంచిక విషయాలు నేను

ఎప్పుడు పట్టుకొన్నానో నాకే తెలియదు గాని, ఇప్పుడు మాత్రం వదలలేక పోతున్నాను. ఇదంతా – **ఆత్మయందు ఆత్మగా దర్శించటం** – ఎట్లాగో అర్థం కావటం లేదు. అందుచేత నీకు భృత్యుడనై నిన్నే ఆశ్రయిస్తున్నాను.

ఈ జగత్తును జగత్తుగా త్యజించి ఆత్మ స్వరూపముగా సందర్శించడ మెట్లా?

హే శ్రీ కృష్ణ ప్రభూ! : నీవు భూత –భవిష్యత్ – వర్తమాన విభాగములతో కూడిన కాలముచే స్పృశించబడని నిత్యసత్యస్వరూపుడవు! సర్వ ప్రకాశకుడవు! స్వయంప్రకాశకుడవు! జన్మజన్మల సుకృతంచేత మీ సామీప్యత లభించింది. నాకు ఆత్మతత్త్వము తెలియజేయగలవారు నీకన్నా మరెవ్వరు సమర్థులు? ఎందుకంటే, మీరు మాయకు యజమానులు! బ్రహ్మాది దేవతాశ్రేష్ఠులు కూడా మీ మాయకు వశులై దేహము, పుత్రులు మొదలైన విషయములు పరమార్థములుగా భావిస్తున్నారు. ఇక నేనెంతటి వాడిని చెప్పండి? ఇదంతా గమనిస్తున్న నా ధైర్యమంతా నిర్వీర్యం (Mild and stoic) అవటం జరుగుతోంది. దుఃఖము – విరాగము నన్ను కమ్మివేస్తున్నాయి. అందుచేత సర్వజ్ఞుడవు, సర్వశక్తి మంతుడవు, వైకుంఠవాసివి, దేశ – కాలముచే పరిమితము కానివాడవు, సర్వజీవులకు హితుడవు, నరసఖుడవు అగు నిన్ను శరణు వేడుచున్నాము.

శ్రీకృష్ణుడు: ఓ ఉద్ధవా ! ఈ జీవుడు బద్ధుడు అవటానికి విషయవాసనలే కారణం సుమా! అట్టి విషయ వాసనలు చిత్తము యొక్క అంతరమున దట్టముగా వ్యాపించి ఉపాధి పరంపరలు అనే భ్రమలకు కారణమగు చున్నాయి. అందుచేత వివేకి అయినవాడు తత్త్వవిచారణచేతను, వివేకముతో కూడిన బుద్ధిచేతను తనను తాను విషయవాసనల నుండి సముద్ధరించుకోవాలి. మానవుడైనవాడు తన బుద్ధిచే విచారణకు ఉపక్రమించాలి. ఈ జీవుడు ప్రత్యక్ష – అనుమానముల ద్వారా తనకు ఏది హితమో, ఏది అహితమో నిర్ణయించుకోవటానికి సమర్థుడే ! అయితే, వివేకముతో కూడి బుద్ధితో వివేచన చేసి ఆత్మదృష్టిని అభ్యసించి

అలవరచుకొంటేనే ఆత్మవిద్య లభిస్తుంది.

శ్లో ॥ ఆత్మనో గురుః ఆత్మైవ పురుషస్య విశేషతః
యత్ ప్రత్యక్ష–అనుమానాభ్యాం శ్రేయోఽ సావనువిన్దతే॥
(అధ్యా 7, శ్లో 20)


ఈ జీవునకు వాస్తవమైన గురువు ఆతని ఆత్మయే! నేను సర్వజీవుల ఆత్మస్వరూపుడను. అది గ్రహించిన సాంఖ్యయోగ విశారదులగు ధీరులు నిర్మలము – సుతీక్షణము – విశాలము అగు బుద్ధిని పెంపొందించుకొని వర్తమాన జన్మయందే నన్ను సంపూర్ణ – సమగ్ర ప్రకటన పూర్వకంగా సందర్శిస్తున్నారు. సర్వాత్మత్వానందమును పుణికి పుచ్చుకుంటున్నారు.

ఓ ఉద్ధవా! నేను ఒకటి – రెండు – నాలుగు – అనేక పాదములతో కూడిన అనేక జీవజాతులనెన్నిటినో సృష్టించాను. వాటిన్నింటిలో మానవ జన్మ ఉత్కృష్టమైనది. ఇది ఎంతగానో పురుషార్థ సాధకమైనది సుమా!

వాస్తవానికి నా స్వరూపము ప్రత్యక్షము కాదు – పరోక్షము కాదు. అట్టి నా అపరోక్ష ఆత్మతత్త్వ స్వరూపం ఈ మానవ దేహులు తమ బుద్ధి కౌశలంతో అనుమానము అనే అన్వేషణ సహాయంతో తప్పక గ్రహించగలుగుతారు.

కాబట్టి నన్ను నీ ఆత్మ స్వరూపంగా గ్రహించు. అట్టి ఆత్మతత్త్వమునందే విద్యమానమైయుంటున్న జాగ్రత్ – స్వప్న – సుషుప్త జగత్తులు –కవియొక్క యోచనలోని కల్పిత కథా సంఘటనలవలె – భావనామాత్రమై కన్పిస్తున్నాయి. వాస్తవానికి **జన్మ – మరణముల మధ్య స్ఫురించేదంతా జ్ఞానాన్వేషకునకు జ్ఞాన సాధనా రూపమే!** గురువు వంటిదే స్వస్వరూపము. స్వస్వరూపమే సర్వమునకు ఆధారము, సర్వ స్వరూపము కూడా! స్వస్వరూపమే సద్గురువు సత్ శాస్త్రము కూడా!

అట్లాగే ఈ దృశ్యజగత్తు కూడా పాఠ్యాంశమే! గురువే!



స్మరణే తరణోపాయం

– భగవాన్ సత్యసాయిబాబా

భారతదేశమునందు పుట్టి భారతీయులనే పేరు పొంది భారతీయ తత్త్వాన్ని గుర్తించుకోలేకపోవడం చాల దురదృష్టకరం. 'భా' అనగా జ్యోతిర్మయము, 'రత' అనగా అభిలషించడం. కనుక జ్యోతిర్మయుడైన భగవంతుణ్ణి అభిలషించడమే భారతీయుల ప్రధాన లక్ష్యం. కానీ ఈనాడు భారతీయులే జ్యోతిర్మయుడైన దైవాన్ని విస్మరిస్తున్నారు. పైగా "మేము సామాన్య మానవులం, సామాన్యమైన జీవితాన్ని గడుపుతున్నాము. నిరంతరము ఎన్నో పనులలో మునిగి ఉంటాము. కనుక భగవంతుణ్ణి స్మరించడానికి మాకు వ్యవధి లేదు" అంటారు. ఇది అర్థం లేని మాట. టీవీలను చూడడం లేదా? సినిమాలకు పోవడం లేదా? ఇతరులగూర్చి మాట్లాడుకోవడం లేదా? ఇన్ని వ్యర్థమైన పనులలో ప్రవేశిస్తూ సార్థకమైన దైవచింతనకు మాత్రం వ్యవధి లేదనడం ఎంత అజ్ఞానం!

అగ్నిలో బొగ్గును వేసి విసనకర్రతో విసిరితే బొగ్గు కూడా అగ్నిగా మారిపోతుంది. ప్రజ్ఞానస్వరూపుడు, జ్యోతిర్మయుడు అయిన దైవమే అగ్ని, అజ్ఞానాంధకారంతో కూడిన మానవుడే బొగ్గు. ఆ అగ్నికి ఈ బొగ్గును సమీపంగా చేర్చి సాధన అనే విసనకర్రతో విసిరితే ఈ బొగ్గు కూడా అగ్నిగా మారిపోతుంది. కానీ మానవుడీ దివ్యమైన రహస్యాన్ని గుర్తించక, దైవాన్ని స్మరించక అహంకార ఆడంబరముతో కాలాన్ని వ్యర్థం గావిస్తున్నాడు.

హృదయపూర్వకంగా మనం దైవనామస్మరణ చేస్తే ఎట్టి బాధలూ మనకు సంభవించవు. ఒకవేళ సంభవించినప్పటికీ వాటిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగే శక్తిసామర్థ్యాలను ఆ నామమే ప్రసాదిస్తుంది.

మీకందరికీ తెలుసు. మీరా పరమ భక్తురాలు. ఆమె లోకాభిమానాన్ని, దేహాభిమానాన్ని త్యజించి ఆనందంతో నిరంతరం కృష్ణలీలలను గానం చేస్తూ ఉండేది. కానీ దేహాభిమాని, లోకాభిమానియైన ఆమె మరిదికి ఇది నచ్చలేదు. మహారాణా భార్య నల్గురిలో పాటలు పాడుతూ తిరగడం రాజకుటుంబానికే అవమానమని భావించాడు. దైవాన్ని స్మరించడం అవమానమనీ, లోకాన్ని వరించడమే గౌరవమనీ విశ్వసించాడు. అందుచేత ఒకనాడు ఆమెకు పాలలో కఠోరమైన విషమును కలిపి అందించాడు. అయితే మీరా తాను ఏది తిన్నా, ఏది త్రాగినా దానిని ముందుగా కృష్ణునికి అర్పించేది. "సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం"అనే భావనతో ఆమె నిత్యకృత్యములను ఆచరిస్తూ ఉండేది. అందుచేత తన మరిది అందించిన పాలగిన్నెను కృష్ణ విగ్రహము ముందు పెట్టి హృదయపూర్వకంగా 'కృష్ణార్పణం' అన్నది. ఆ మాట కేవలం ఆమె పెదవులనుండి వచ్చినది కాదు. హృదయం నుండి ఆవిర్భవించినది. ఆమె ప్రార్థన విన్న తక్షణమే కృష్ణుడు విషమును తాను ఆరగించి, ఆ పాలను దివ్యమైన అమృతంగా మార్చాడు. ఆ పాలను కృష్ణుని ప్రసాదంగా భావించి ఆమె ఆనందంగా త్రాగింది. మీరా మరణించిన వార్త ఏ నిమిషంలో వస్తుందో అని ఆమె మరిది చాల ఆసక్తితో, అతురతతో ఎదురు చూస్తున్నాడు. కానీ అనుకున్నది ఒకటి, జరిగింది మరొకటి! ఆ పాలలో కలిపిన విషం ఆమెపై ఎట్టి ప్రభావమూ చూపలేదని తెల్సుకొని చాల నిరాశ చెందాడు. ఆమె త్రాగగా మిగిలిన కొద్దిపాటి పాలను తీసుకు వెళ్ళి పరీక్ష చేయించాడు. అందులో విషము లేనే లేదని తేలింది. మరి అతడు స్వయంగా కలిపిన విషం ఎక్కడికి పోయినట్లు? దానిని భగవంతుడు ఆరగించాడు. ఎందుకంటే దానిని భగవత్ప్రీత్యర్థం అర్పితం చేసింది మీరా. భగవత్ప్రీత్యర్థంగా దేనిని అర్పించినా అందులోని మాలిన్యాన్ని తొలగించి దానిని పవిత్రం గావిస్తాడు భగవంతుడు.

కొంతకాలం తరువాత మహారాణాయొక్క పరమ విరోధియైన అక్బర్ చక్రవర్తి మీరా భక్తి ప్రపత్తులను గూర్చి ఆనోట, ఈనోట విన్నాడు. ఎట్లాగైనా సరే ఆమె దర్శనం చేసుకోవాలని అతనిలో తీవ్రమైన వాంఛ కలిగింది. ఈ విషయాన్ని బీర్బల్‌కు చెప్పాడు. అతడు కూడా వెంట వస్తానన్నాడు. ఒకనాడు ఇరువురూ మారువేషాలు ధరించి మీరా దర్శనార్థమై బయలుదేరారు. ఆ సమయంలో మీరా కృష్ణమందిరంలో భక్తిపారవశ్యంతో తన్మయురాలై గానం చేస్తున్నది. ఆమె గానం విని అక్బర్ అలౌకికానందంలో మునిగిపోయి తనను తాను మరచిపోయాడు. బీర్బల్ అతని వీపుతట్టి హెచ్చరించేంతవరకు తానెవరో, ఎక్కడున్నాడో, ఏమి చేస్తున్నాడో అక్బర్‌కు స్మృతికి రాలేదు. చిట్టచివరికి వెళ్ళిపోయేముందు అక్బర్ ఒక హారాన్ని పట్టుకొని మీరావద్దకు వెళ్ళి, "అమ్మా! ఈ హారాన్ని దయతో స్వీకరించి కృష్ణుని మెడలో వేయవలసింది" అని ప్రార్థించాడు. అప్పుడు మీరా "పరుల వస్తువులను నేను ముట్టను. ఈ హారాన్ని కృష్ణుని మెడలో వేయాలనుకుంటే మీరే లోపలికి వెళ్ళి వేయండి" అన్నది. కానీ కృష్ణుని దగ్గరకు పోవడానికి అక్బర్‌కు ధైర్యం చాలలేదు. "అమ్మా! నన్ను క్షమించి మీరే ఈ మాలను తీసుకొని కృష్ణుని మెడలో వేయండి" అని మరొక్కమారు ప్రార్థించాడు. అక్బర్ ప్రార్థనను కాదనలేక మీరా అతని చేతినుండి ఆ హారాన్ని అందుకొని కృష్ణుని మెడలో వేసింది. ఈ దృశ్యాన్ని మహారాణా తమ్ముడు చూశాడు.

కుక్క చెప్పులను వెతుకుతుంది. దుష్టుడు తప్పులను వెతుకుతాడు. మహారాణా తమ్ముడు మీరాలో ఎప్పుడు ఏ తప్పు కనిపిస్తుందా అని నిరంతరము వెతుకుతూ వచ్చాడు. ఎప్పుడైతే మీరా అక్బర్ చేతి నుండి ఆ హారమును అందుకోవడం చూశాడో తక్షణమే మహారాణావద్దకు వెళ్ళి ఆమెపై లేనిపోనివన్నీ కల్పించి చెప్పాడు. "ఈ మీరా మన వంశగౌరవాన్ని, రాజ్యగౌరవాన్ని మట్టిపాలు చేస్తున్నది. మన కీర్తిప్రతిష్ఠలను మంటగలుపుతున్నది.ఇకపై ఈమెను మనదగ్గర పెట్టుకోవడం మంచిది కాదు. తక్షణమే బయటికి పంపించు" అని ఒత్తిడి చేశాడు. అక్బర్ పేరు వింటూనే మహారాణా కూడా కోపోద్రిక్తుడయ్యాడు. తక్షణమే కృష్ణమందిరానికి వచ్చి, "మీరా! ఇక నీవు బయటికి వెళ్ళు" అని ఆదేశించాడు. అతడలా ఎందుకు అంటున్నాడో ఆమెకు అర్థం కాలేదు. "నేనున్నది కృష్ణుని కోసమే! కృష్ణుణ్ణి వదలి నేనెక్కడికి వెళ్ళగలను?" అని ఒక్క క్షణం యోచించింది. అంతమాత్రము ఆలస్యాన్ని కూడా భరించలేక మహారాణా ఆమె జుట్టు పట్టి బయటికి ఈడ్చేశాడు. అప్పుడు మీరా "నా హృదయమే నీ మందిరము కృష్ణా! కాబట్టి మనిరువురిని ఎవ్వరూ విడదీయలేరు" అనుకొని 'చలోరే మన్ గంగా యమునా తీర్" అని పాడుకొంటూ బయలుదేరింది. ఏది గంగ? ఏది యమున? మన నాసికములో కుడిప్రక్క గాలిని 'ఇడ' అన్నారు. ఎడమప్రక్క గాలిని 'పింగళ' అన్నారు. ఇవే గంగాయమునలు. ఈ రెండింటి చేరికయే సుషుమ్నానాడి. అదే భ్రూమధ్య స్థానము. అట్టి గంగా యమునా తీరానికి వెళ్ళవలసిందిగా మనస్సుకు బోధించింది.

మీరా కుంభవృష్టిని, పెనుగాలిని సైతం లెక్క చేయక వీధివీధిలోను భజన చేసుకుంటూ వెళుతుంటే స్త్రీలు, పురుషులు అనేకమంది ఆమెను అనుసరించారు. అలనాడు వాల్మీకి శిష్యులైన లవకుశులు కూడా రుద్రాక్షలు ధరించి తంబుర మీటుతూ వీధివీధిలోను గొంతెత్తి రామభజన చేస్తూ వచ్చారు. కానీ, ఈనాడు అనేకమంది భజన చేయాలన్నా, నగర సంకీర్తనకు పోవాలన్నా బిడియపడుతుంటారు. భగవన్నామం చెప్పడానికి బిడియమెందుకు? దేహము వచ్చినదే దైవనామస్మరణకోసం, కనుకనే మీరా "ఓ కృష్ణా! సంసారమనే సముద్రంలో ఎంతో లోతుకు వెళ్ళి, ఎంతో కష్టపడి అత్యంత విలువైన నామమనే ముత్యాన్ని సంపాదించాను. ఇంత కష్టపడి నేను సంపాదించుకున్న ఈ ముత్యం తిరిగి నా చేతినుండి జారిపోకుండా చూసుకో. ఇంక నాకు నీవు తప్ప మరొక గతి లేదు

ఓ గిరిధారీ!" అని ప్రార్థించింది.

ఎప్పుడైతే మహారాణా మీరాను వెళ్ళగొట్టి కృష్ణమందిరం యొక్క తలుపులను బిగించాడో అదే క్షణంలో అక్కడ ద్వారకలోను కృష్ణమందిరం యొక్క తలుపులు మూసుకుపోయాయి. ఎవరెంతగా ప్రార్థించినా, ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అవి తెరుచుకోలేదు. మహారాణా తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడి మీరాకు క్షమాపణ చెప్పుకోవాలని బయలుదేరాడు. మీరా ద్వారక చేరుకొని "గిరిధారీ, గిరిధారీ.." అని స్మరిస్తూ మందిర ద్వారాలను తన తలతో కొట్టింది. ఆ ద్వారాలు తెరుచుకోవడం, మీరా ప్రాణాలు వదలడం రెండూ ఒకేసారి జరిగిపోయాయి. కృష్ణుడు ప్రత్యక్షమై ఆమెను తనలో లీనం చేసుకున్నాడు. మీరా కొద్ది నిమిషాలలో ప్రాణాలు వదులుతుందనగా మహారాణా పరుగెత్తుకొని వచ్చి "మీరా! తెలియక నా తమ్ముని మాటలు విని నీకు తీరని ద్రోహం చేశాను. నన్ను క్షమించు, క్షమించు, క్షమించు..." అంటూ పశ్చాత్తాపపడ్డాడు. **(సశేషం)**

4వ భాగవత సదస్సు

శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారి శ్రీ విద్యాప్రకాశానంద స్మారక 4వ భాగవత సదస్సు **21-10-2018 తేది నుండి 27-10-2018 తేది** వఱకు వారం రోజులు **ప్రతిరోజు ఉదయం 9 గం॥ నుండి 10-30** వఱకు **ఆశ్రమ శివాలయంలో,** ప్రతిరోజు సాయంకాలం 6 గం॥ల నుండి 7-30 గం॥ వఱకు శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ వరదరాజ దేవాలయ ప్రాంగణంలో జరుగును. సుప్రసిద్ధ పూజ్యశ్రీ శారద ప్రియానందస్వామినివారి ముఖ్య శిష్యురాలు, **ప్రస్తుత చిన్మయారణ్యాశ్రమ అధ్యక్షురాలు పూజ్యశ్రీ శీలానందసరస్వతి స్వామినిగారు భాగవత చతుర్థ స్కంధంపై ప్రవచన చేస్తారు. అందరికీ ఆహ్వానము.**



శ్రీ మదాంధ్ర మహా భాగవతం

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

ధారణ

శుకమహర్షి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"పండితుడు భార్యాబిడ్డలమీద మమకారం విడిచి పెట్టాలి. ఇంద్రియాలను అరికట్టాలి. గాలిని బిగబట్టాలి. విష్ణువుమీద మనస్సు పెట్టాలి. విష్ణుదేవుడి విరాట్ స్వరూపంలో మూడు కాలాలకు చెందిన ప్రపంచమూ గోచరిస్తుంది. సమస్త విశ్వమూ అతని దివ్యవిగ్రహమే. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, అహంకారము, మహత్తత్త్వము అనబడేవి ఏడు ఆవరణాలు. మహాండకోశమే విరాట్పురుషుని శరీరము. ఈ ఏడు ఆవరణాలు ఆ విరాట్పురుషుడి శరీరాన్ని కప్పి ఉన్నాయి. ధారణకు ఆధారభూతుడైన విరాట్పురుషుడు ఆ శరీరంలో ప్రకాశిస్తున్నాడు.

పాతాళమే విష్ణువు అరికాళ్ళు. రసాతలం - కాలిమడమ, మునివ్రేళ్ళు. మహాతలం - చీలమండలం, తలాతలం - పిక్కలు, సుతలం -మోకాళ్ళజంట, వితలం, అతలం -తొడలు, భూతలం -పిరుదు, ఆకాశం - బొడ్డు, గ్రహాలూ తారకలూ మొదలైన జ్యోతిస్సమూహంతో కూడిన నక్షత్రలోకం -వక్షఃస్థలం, మహర్లోకం- మెడ, జనలోకం-ముఖం, తపోలోకం-నొసలు, సత్యలోకం-శిరస్సు, ఇంద్రుడు మొదలైనవారు - భుజదండాలు, దిక్కులు-చెవులు, శబ్దం -శ్రోత్రేంద్రియం, అశ్వినీ దేవతలు - ముక్కుపుటాలు, గంధం- ఘ్రాణేంద్రియం, అగ్ని-నోరు, అంతరిక్షం -కళ్ళు,సూర్యుడు-నేత్రేంద్రియం, రాత్రింబవళ్ళు-కనురెప్పలు, బ్రహ్మస్థానం-కనుబొమలు,జలాలు-దవడలు, రసం-నాలుక, సమస్తవేదాలు-విష్ణుదేవుడి మాటలు, యముడు -కోరలు, సంతానం

మొదలైన వారిమీద ఏర్పడే స్నేహకళలు -దంతాలు. ప్రజలకు పిచ్చెత్తించే మాయావిశేషాలే - మాధవుడి నవ్వులు. అంతూ పొంతూలేని సృష్టి- అతని కడగంటి చూపులు. సిగ్గు, లోభం పెదవులు. రొమ్ములే - ధర్మం, అధర్మమే- అతని వీపు, ప్రజాపతి - పురుషాంగం, మిత్రావరుణులు -వృషణాలు, సముద్రాలు -కడుపు, కొండలు -ఎముకలు, నదులు-నాడులు, చెట్లు-రోమాలు, వాయువు -నిట్టూర్పులు, కడలేని కాలమే -ప్రాయం, సంసారాలే -కర్మలు, మబ్బులు -శిరస్సు మీది వెంట్రుకలు, సంధ్యలు-కట్టుబట్టలు, హృదయం-పరమాత్మ, చంద్రుడు-మనస్సు, మహత్త్వం -చిత్తం, రుద్రుడు - అహంకారం, గుర్రాలు, కంచరగాడిదలు, ఒంటెలు, ఏనుగులు- గోళ్ళు. పశువులు, మృగాలు మొదలైనవి - కటిప్రదేశం. మనువు, బుద్ధి, చారణులు, అప్సరసలు - షడ్జం మొదలైన స్వరాలు. ప్రహ్లాదుడు స్మృతి, దైత్యులు, దానవులు -వీర్యం. ఆ సర్వేశ్వరుడి ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, తొడల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జన్మించారు. వసువులు, రుద్రులు మొదలైన దేవతల పేర్లే ఆయన పేర్లు. హవిర్భాగాలు ద్రవ్యాలు. యజ్ఞప్రయోగాలు కర్మలు. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వమంతా విష్ణుమయమే. ఆ విష్ణువు విశ్వమయుడే. ఈ విషయంలో ఎటువంటి సందేహానికీ తావులేదు. విష్ణుమయం కాని పదార్థమేదీ అణుమాత్రం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. మోక్షం పొందాలనుకునేవారు ఇటువంటి భగవంతుడి విరాడ్రూపాన్ని మనస్సులో నిలుపుకోవాలి. అనుసంధానం చేస్తూ గడపాలి. విష్ణువును ఆశ్రయిస్తే మోక్షం మాత్రమే కాదు ఏదైనా కరతలామలకమే.

పూర్వం బ్రహ్మ ప్రపంచాన్ని సృష్టించాలనుకున్నాడు. అయితే అది ఆయనవల్ల కాలేదు. హరిని ఆశ్రయించాడు. బుద్ధి వికాసం కలిగింది. తదుపరి ఈ ప్రపంచాన్ని సృష్టించగలిగాడు.

జీవుడు ఎంతో కుతూహలంతో ఎన్నో శరీరాలను కలలో లాగే ధరిస్తాడు. పలు పేర్లతో వ్యవహరింపబడతాడు. ఇంద్రియాల ద్వారా

విషయాలను గ్రహిస్తాడు. తరువాత ఎప్పటికో తనను తాను తెలుసుకుంటాడు. జీవుడివంటివాడే పరమేశ్వరుడు. అతడు అందరి హృదయాల్లోనూ ఉంటాడు. బుద్ధి వ్యాపారాల్ని గమనిస్తూనే ఉంటాడు. కాని ఎక్కడా తగుల్కోడు. అతడు సచ్చిదానంద స్వరూపుడు. అందువల్ల అతన్ని సేవిస్తే మోక్షం సిద్ధిస్తుంది. ఇతరులను సేవిస్తే భవబంధాలు తొలగవు. మోక్షం కలుగదు.

అజ్ఞాని మాయకు లోబడతాడు. స్వర్గసుఖాలను కోరుకుంటాడు. మోక్షసుఖాన్ని అభిలషించడు. జ్ఞాని తన శరీరం నిలబడేందుకు కావలసిన మేరకే వసతులను స్వీకరిస్తాడు. సంసార సుఖానికి అతీతంగా ప్రవర్తిస్తేనే సిద్ధి కలుగుతుందని గుర్తిస్తాడు. తదనుగుణంగా ప్రవర్తిస్తాడు.

ఎటువంటి రక్షణా లేని వారిని రక్షించేందుకు విష్ణువు సిద్ధంగా ఉన్నప్పటికీ, రక్షించమంటూ ఒక మానవుణ్ణి ఆశ్రయించడం హాస్యాస్పదమని ఆత్మజ్ఞులు భావిస్తారు. ఈ తలపుతోనే బుద్ధిమంతుడు వాసుదేవుణ్ణి సేవిస్తాడు. అవిద్యను అధిగమిస్తాడు. ఆనందం పొందుతాడు. వాసుదేవుణ్ణి సేవించనివారు నరకంపాలై నానాయాతనలు అనుభవిస్తారు. యమలోకద్వారంలో ప్రవహించే వైతరణీనదీ జ్వాలలకు తట్టుకోలేక క్లేశాన్ని అనుభవిస్తారు. భగవంతుణ్ణి భజించని పాషండులను యమభటులు గదలతో మోదుతారు.

సత్పురుషులు తమ శరీరము మొదలైన వాటిమీద అహంకార మమకారాలను పరిత్యజిస్తారు. మాధవుడి పాదారవిందాలమీద మాత్రమే మనస్సు నిలుపుతారు. వాసుదేవుడి దివ్యాంగాలను క్రమంగా భావిస్తూ ధారణ చేస్తారు. విష్ణువుకు సంబంధించిన పరమపదమే అన్నిటికంటే గొప్పదని గ్రహిస్తారు.

సత్పురుషులు విష్ణువును ఆశ్రయిస్తారు. విష్ణువును ఆశ్రయించే వారికి ఏదైనా సిద్ధిస్తుంది. విష్ణువును ధ్యానించేవారు రెండు రకాలుగా ఆయన్ను ధ్యానించవచ్చు. మొదటిది ఆయన మనోహరరూపం. రెండవది

విశ్వాత్మకమైన ఆయన విరాట్ స్వరూపం. విష్ణువును ఆశ్రయించని వారు నానాయాతనల పాలుకాక తప్పదని శుకమహర్షి మాటలను బట్టి బోధపడుతుంది.

శుకమహర్షి చెప్పిన దాన్నిబట్టి విశ్వంలోని సమస్త పదార్థాలు విష్ణుదేవుడి అంగాలేనని విస్పష్టమౌతుంది. విష్ణువు కానిది ఏదీ లేదని విదిత మౌతుంది. ఆ విశ్వరూపుడి తలంపు విస్మయానందాన్ని కలిగిస్తుంది. బ్రహ్మ అంతటి వాడికి కూడా విష్ణుదేవుడి అనుగ్రహం చేతనే సృష్టించే జ్ఞానం కలగడం గమనార్హం. మానవులను ఆశ్రయించడం కంటే మాధవుణ్ణి ఆశ్రయించడమే మహోత్కృష్టం. **(సశేషం)**

సద్గురు సర్వసేవా ట్రస్టుకు క్రిందివారు పైకం పంపినారు

(1). జి.ఎస్.రామచంద్రన్ (చెన్నై) రూ. 20,000/-
(తండ్రి జి.ఎస్. సుబ్రహ్మణ్యం పేరిట) చాతుర్మాస్య భిక్షకు

(2). వేదాన్తం శివసుందర ప్రసాద్ (సికింద్రాబాద్) రూ. 25001/-
(ఆశ్వయుజ బహుళ ద్వాదశి భిక్షా నిధి)

(3). శ్రీమతి హయగళ వరలక్ష్మి (సికింద్రాబాద్) రూ. 15000/-
(భర్త విజయశివరాజు పేర వడ్డీతో భిక్షకు నిధి)

వేదాన్తభేరికి పోషక చందా క్రింది వారు పంపినారు

(1). కె.భాస్కర్‌రెడ్డి (కట్టమంచి, చిత్తూరు) రూ. 2000/-
(2). మహాజన్ జలంధర గుప్త (ఖానాపూర్,నిర్మల్ జిల్లా) రూ. 1500/-
(3). బూడిద శంకరం, కేరాఫ్ : శివాలయం (కాకుటూరు) రూ. 1500/-
(4). కట్టా భాస్కరరావు (అంగలూరు) రూ. 1500/-
(5). డా ॥ యు.ఎస్.ఎన్.మూర్తి (శాంతిపూర్,అస్సాం) రూ. 1516/-
(6). ఎస్. లలిత (ఎం.ఐ.జి.హెచ్-హైద్రాబాద్) రూ. 1000/-
(7). ఎ.శ్రీనివాసులు (ఎల్.ఎం.పురం, నందలూరు మండలం) రూ. 1500-
(8). పి.రామసుబ్బారెడ్డి (నల్లతిమ్మాయపాళెం) రూ. 1500/-

తిరుమల రాయుని దివ్యోత్సవం

రచన: డా॥ కె.బి. రాజేంద్రప్రసాద్, ఎం.ఎ., పి.హెచ్.డి. (తాడిగడవ)

తిరుమల శ్రీవారికి చతుర్ముఖ బ్రహ్మ నిర్వహించే బ్రహ్మోత్సవం కమనీయం, కడురమణీయం. కలియుగ వైకుంఠంగా కీర్తిని పొందిన ఏడుకొండలు, దివిజ సంఘాలతో, తాపసగణాలతో, సంకీర్తనాచార్యులతో, భజన బృందాలతో, భక్త పారిజాతాలతో దివ్యమై భవ్యమై పావనమయమై పరిఢవిల్లడం ప్రపంచజీవుల సుకృతం. తెలుగువారి పుణ్య విశేషం. కమల గర్భుడైన బ్రహ్మ కమలనాభుడైన తండ్రి ఆ శ్రీమన్నారాయణునకు స్వయంగా నేతృత్వం వహించి నిర్వహిస్తున్న ఉత్సవం బ్రహ్మోత్సవం. అక్షర పరబ్రహ్మయైన పరమాత్మకు జీవులందించే బ్రహ్మాండమైన నీరాజనం ఈ దివ్యోత్సవం. ఇదో నేత్రోత్సవం. కోనేటి రాయుని కాంక్షలుదీరా కాంచ గల్గిన కన్నులు, ఆయన సంకీర్తనలను వినగల చెవులు, ఆ స్వామిని వర్ణించ గల నాలుక, ఆ దేవునికి మ్రొక్కే శిరము,చింతించే మనస్సు, యోచించే మేధస్సు, పూజించే చేతులు మొత్తంగా స్వామి భక్తిని ప్రకటించే బ్రతుకు అర్థవంతం. పరమార్థసాధకం. అలాంటి దేవదేవుని దివ్యోత్సవమైన బ్రహ్మోత్సవ విశేషాలను ఒకింత సమీక్షించుకొందాం.

భగవత్ తత్త్వాన్ని ఐదువిధాలుగా విజ్ఞులు వివరిస్తున్నారు. జ్ఞానం, సమృద్ధి, సంపత్తి, కీర్తి, బలం, ఐశ్వర్యం అనే షడ్గుణైశ్వర్య పరిపూర్ణుడు పరమాత్మ. వైకుంఠ నివాసి. స్వామిని కేవలం ముక్తిని పొందిన సుజ్ఞానులు మాత్రమే దర్శింపగలరు. ఈ రూపమే అక్షర పరబ్రహ్మరూపం. ఈ రూపమే సచ్చిదానందమూర్తి. ఈ మూర్తినే ఉపనిషత్తులు ప్రస్తుతిస్తున్నాయి. ఈ రేడు లోకాలు స్వామిలోనే ఉనికిని పొందియున్నాయి. రెండవది వ్యూహరూపం. ఇదే ఈశ్వరత్వం. ఈ పరమేశ్వర తత్త్వమే బ్రహ్మవిష్ణు శివాత్మికమై సృష్టి స్థితిలయలనే లీలావిలాస ప్రక్రియకు తెరదీయడం జరిగింది. మూడవది అంతర్యామి. "ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశే

అర్జున తిష్ఠతి” సమస్తజీవుల హృదయగుహల్లో పరమాత్మ ఉంటున్నాడు. అందుకే దేహం దేవాలయం అంటున్నాం. జీవులు పాపవిముక్తులై బ్రహ్మానందా నుభూతిని పొందాలని స్వామి అభిలాష. నాల్గవరూపం విభవం. అనగా అవతారాలు. ధర్మగ్లాని కల్గినపుడు, అధర్మం పెచ్చుమీరినప్పుడు, ధర్మసంరక్షణ, దుష్టశిక్షణ, సాధు సంరక్షణకు స్వామి అనేకానేక రూపాలలో భువికి వస్తున్నాడు. అవతార లక్ష్యాలను సాధించి, ప్రకృతిని, ప్రకృతి జీవులను సంరక్షించి, బ్రతుకు బాటను, పాటను తెలియ చెప్తున్నాడు. మానవ సౌశీలాన్ని ఆవిష్కరిస్తున్నాడు. అవే రామకృష్ణాది అవతారాలు. భగవంతుని అవతారాలు విశ్వజీవన వికాసానికి, విశ్వ జీవుల సంరక్షణకును సహకరిస్తున్నాయి. ఇంక చివరిది, ఐదవది అర్చామూర్తి. ఈ అర్చామూర్తులే విగ్రహాలు. కొన్ని స్వయంభూరూపాలు. మరికొన్ని అర్చనలకు భక్తులు చేయించి, ప్రాణప్రతిష్ఠ చేసినవి. ఈ మూర్తులను ఆగమాలు వివరించిన రీతిలో, భక్త్యనుభూతితో పూజించి, స్వామి కృపకు మనం పాత్రులవుతున్నాం.

అలా తిరుమలగిరిపై వెలసిన అర్చామూర్తియే శ్రీవేంకటేశ్వరస్వామి. పాపాలను నాశం చేసే దైవం కనుక వేంకటేశ్వరుడైనాడు స్వామి. కలియుగ ప్రత్యక్షదైవం. అభయహస్తపు మహిమలతో ఆపదల నుండి జీవులను సంరక్షించే సర్వేశ్వరమూర్తి..

కృతయుగం ధ్యానం, జపతపాదులకును, త్రేతాయుగం క్రతువులకు, ఆధ్యాత్మిక పావన కార్యకలాపాలకు, ద్వాపరం అర్చనలు, వందనాలకును, కలియుగం నామసంకీర్తనలకు, భాగవత కథా పఠన పారాయణ శ్రవణాదులకును శ్రేష్ఠమై జీవులకు హితాన్ని కల్గిస్తాయని పెద్దల అభిభాషణం. కలియుగం కలిపురుషుడు పాదం మోపిన యుగం. ధర్మ దేవత తనకున్న తపస్సు, శౌచం, దయ అనే మూడు పాదాలను కోల్పోయి, సత్యం అనే ఒంటికాలు మీద నడిచే కాలం. ద్వాపర యుగాంతంలో అన్నా చెల్లెండ్రకు బుట్టిన పాపాత్ముడైన కలిపురుషుని ప్రభావానికి లోబడిన కాలం కలికాలం. కలియుగం. సర్వం కాలాధీనమనేది శాస్త్ర వచనం.

శ్లో ॥ వాత్యేవ నూనం కలిదేవతైషా

బలాత్సమాకర్షతి బుద్ధివృక్షాన్ ।

తస్మాత్ గుహాయాం హృదయే శయానం

హరిం భజస్వాత్ర న కాల వాత్యా ॥

“కలి పురుషుడు మానవుల బుద్ధులనే వృక్షాలను వేగవంతమైన గాలివలే పెకలించి వేస్తాడు. కనుక బుద్ధి గుహలో వసించే పరమాత్మను భజించండి ” అంటోంది పురాణం. కనుక అధర్మపరుడైన కలిపురుషుని నుండి మనం రక్షింపబడాలంటే పరమాత్మ భజనయే ఆధారం. అందుకే “భాగవతం కలియుగంబున నొక్క ముహూర్త మాత్రంబున నారాయణ స్మరణ పరాయణులై మనంబున శ్రీనృసింహ, వాసుదేవ, సంకర్షణాది నామంబుల నచంచల భక్తిందలంచువారలకు, గ్రతుశత ఫలంబుగలుగు” నని సెలవిచ్చింది. కనుక స్వామి పూజలు, స్వామి నామస్మరణ, స్వామి చింతన కలియుగ జీవులకు అవసరం’ అనుసరణీయం.

అయితే పరమాత్మ అవతారాలకన్నా, అర్చామూర్తులుగ ఈ కాలపు జీవులకు అందుబాటులో ఉండడమే మంచిదని భావించి, తిరుమల, శ్రీరంగం వంటి పావన పుణ్యక్షేత్రాలలో స్వామిరూపాలు స్వయంభువులుగ రావడం జరిగిందని విజ్ఞుల విశ్వాసం.

కృతయుగంలో దేవాసురుల మధ్య, త్రేతాయుగంలో రెండు దేశాల మధ్య అనగా రామరావణుల మధ్య, ద్వాపరంలో ఒకే కుటుంబంలో కురుపాండవుల మధ్య యుద్ధాలు జరిగాయి. కలియుగంలో వ్యక్తి హృదయంలోను, వ్యక్తుల మధ్య మంచికి, చెడుకు మధ్య సంఘర్షణలు జరగడం ఒక విశేషం. ఈ అన్నింటికీ మూలం కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యమనే అంతశ్శత్రువులు. ఇవి దరికి చేరకుండా ఉండాలంటే మనిషి మనసులో ప్రేమ కలగాలి. అది బంధం

కారాదు. భక్తియుండాలి. భగవత్ తత్త్వం అనుభవంలోనికి రావాలి. అప్పుడే సర్వప్రాణులయందున్న పరమాత్మ ఒక్కడే అనే భావం కల్గుతుంది. ఈ భావమే బ్రతుకులను తరింప చేస్తాయి. అందుకు అర్చామూర్తులను భక్తి శ్రద్ధలతో భజించాలి.

నిజానికి బ్రహ్మోత్సవాలు విశ్వజీవుల సంరక్షణార్థమనేది నిజం. ఇవి కూడా నిత్యబ్రహ్మోత్సవం, శాంతి బ్రహ్మోత్సవం, శ్రద్ధా బ్రహ్మోత్సవం, ఒక్కరోజు బ్రహ్మోత్సవం అని నాల్గు విధాలు. ప్రతి సంవత్సరం నిర్ధారిత నక్షత్ర ప్రధానంగా నిర్వహించే బ్రహ్మోత్సవమే నిత్యబ్రహ్మోత్సవం. అవే ఆశ్వయుజ మాసంలో స్వామివారికి నిర్వహించే బ్రహ్మోత్సవాలు నవరాత్రి బ్రహ్మోత్సవాలు. ఆరంభానికి ముందురోజే నవాహ్నిక దీక్షతో అంకురార్పణం జరుగుతుంది.

పావన ప్రదేశంలో మట్టిని గ్రహించి, యాగశాలలో తొమ్మిది పాళికలలో మట్టిని నింపి, నవధాన్యాలను మంత్రపూతంగా చల్లి, నీరుచల్లి, పూజలు నిర్వహిస్తారు. ఇదే అంకురార్పణ. చంద్రుడు రోజుకు ఒక కళచొప్పున పూర్ణిమనాటికి పదునారు కళలతో పరిపూర్ణుడైనట్లు ఈ నవ ధాన్యాలు మొలకెత్తి వృద్ధిని పొందాలని, ఈ పూజాఫలితం విశ్వజీవుల ఆహారవృద్ధికి దోహదపడుతుందని భావన. మిగిలిన మట్టిని యాగకుండానికి వినియోగిస్తారు. ఆ తరువాత గరుత్మంతుని చిత్రంగల వస్త్రాన్ని ధ్వజస్తంభం దగ్గర పూజలు నిర్వహించి, దాన్నే పతాకా విష్కరణగకావిస్తారు. ఇది ధ్వజారోహణం. దీని ద్వారా అఖిలోకాధీశు లకు, దివిజ సంఘాలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం పంపడంగా భావింప బడుతుంది. ఇక నాటినుండి ప్రతిరోజు స్వామిని ఒక్కో పూట ఒక్కో ఆకృతిలో అలంకరించి, వాహన సేవను అందిస్తారు. వాహనాలు మహనీయ భక్తి ప్రపత్తులతో స్వామిని సేవించడం.

నిజానికి తిరుమలలో మూలమూర్తి, భోగశ్రీనివాసమూర్తి, కొలువు శ్రీనివాసమూర్తి, ఉగ్రశ్రీనివాసమూర్తి, మలయప్పస్వామి అని ఐదు రకాల

మూర్తులున్నాయి. అందు మూలమూర్తి స్వామి స్వయంభువు విగ్రహం. ఎనిమిది అడుగులు పైగా ఎత్తు ఉంటుంది. శిరమున వజ్రకిరీటం, ముఖమున తిరుమణి, కర్ణకుండలములు, పెదవులపై చిఱునగవు, అభయహస్తం, ఉరమున శ్రీభూదేవీలు, అందంగా, అద్వితీయంగా, జీవాత్మలను ఆనుశీలనం చేస్తూ ఆశీర్వదించి అభయమిస్తూ వెల్గొందే దివ్యతేజోమూర్తి. ఇంక మలయప్ప ఇరువంకల శ్రీభూదేవీలతో అలరు తుంటారు. ఊరేగింపులకు, వాహనసేవలకు, ఉత్సవాలకు, కల్యాణాలకు కన్పించే మహనీయరూపం. మిగిలినవి ఏదో అడపదడపా కన్పిస్తాయి. కనుక మలయప్పస్వామికే వాహనసేవ. అలంకరణ, అవతారాల మార్పు. వేదాలే శిలలై, పుణ్యరాశులే ఏరులై, దివిజులు మృగజాతులై, తాపసులు తరువులై, శుకపికశారికా గణాల సంకీర్తనలతో, తుమ్మెదల ఝుంకార వేదనాదాలతో, విభిన్న పుష్పజాతుల పరిమళాలతో, భక్తుల “గోవింద” నాదాలతో ఏడుకొండలు మరో వైకుంఠనగరిని గుర్తు చేస్తాయి. మహనీయ ఆధ్యాత్మిక శోభను సంతరించుకొంటాయి. ప్రసాదాల పరిమళాల గుబాళింపు, అన్నదానాల పలుకరింపు, ఆత్మీయ భక్త సంఘాల ఆతిథ్యం అనిర్వచనీయం. ఇలా నవాహ్నికదీక్షతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జీవాత్మలను తరింపచేస్తాయి. పరమాత్మకు పరితృప్తి కల్గిస్తాయి. కలి పురుషుని ప్రభావాన్ని నిర్వీర్యం చేస్తాయి. వెరసి లోక కల్యాణ కారకంగా ఈ బ్రహ్మోత్సవాలు సాగుతాయి. అందుకే తెనాలి రామలింగ కవి

అచలమిది ముక్తిసతి చేతియలరుబంతి

పావక దళుల నిలగూల్చు భద్రదంతి

యీప్సితార్థ రసమ్ములనీను సురభి

సంయమీంద్రులకు లావనీజాత సురభి. అని కీర్తించడం జరిగింది. చివరి రోజున చక్రత్తాళ్వార్ రూపంలో చక్రస్నానం చేయించి, చివరకు ధ్వజావరోహణం చేసి ముగింపు పలుకుతారు అర్చకస్వాములు.

స్వామి అలంకార ప్రియుడు. శృంగారరాయడు. ఆళ్వారులు దివ్య ప్రబంధాలకు, వైష్ణవాచార్యుల వేదస్వరనాదాలకును ముగ్ధుడై ముక్తినొసగే ప్రభువు ముకుందుడు. "కడుపుణ్యులను పాపకర్ములను సరిగావ జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే" అన్న అన్నమయ్య ఎంతటి సుజ్ఞాని? పరమాత్మకు హీనుడు–అధముడనే భేదం లేదు. అందరకూ ఆ శ్రీహరే అంతరాత్మ. ఈ నిజాన్ని గుర్తించాలి. విశ్వమంతా హరిమయం. శ్రీహరి "లేని కాని" దేదీ లేదు. ఈ నిజాల్ని ఋజువు చేయడానికే యీ ఉత్సవాలు, ఈ సేవలు. అందుకే భాగవతుల కథలు, భాగవతుల పాటలు, భజనలు, హరినామసంకీర్తనలు మొదలయినవి జీవిని అసలైన సుజ్ఞాన ప్రపంచం వైపు నడిపిస్తాయి. లోకరక్షణార్థం, జీవుల సంరక్షణార్థం నిర్వహించే తిరుమల రాయుని దివ్యోత్సవాలను దర్శించి తరించాల్సిందే.

"కోరిన కోర్కెలు కోయని కట్లు

తీరవు నీవవి తెంచక

భారపు పగ్గాలు పాప పుణ్యములు

నేరుపుల బోనీవు నీవు వద్దనక" అంటారు అన్నమాచార్యులు. ఆధ్యాత్మిక దారులలో నడచే వ్యక్తికే ఐహిక వాంఛలపై విరక్తి కల్గుతుంది. భక్తి ప్రభవిస్తుంది. భక్తి యోగంతోనే స్వామి మమకార బంధనాలను, కోరికల కట్లను త్రెంచుతాడు. ముక్తికి దగ్గరకావడం జరుగుతుంది. కనుక అచ్యుతుని దరిచేరి, హరినామస్మరణను వీడక, ఆత్మజీవనంతో ఆ దేవదేవుని శరణు కోరదాం. భాగవతంలో "వరాలిస్తాను కోరుకో" అని పరమాత్మ అంటే "స్వామీ! నీ పాదపద్మాల సేవ, నీ పాద పూజలు చేసే భాగవతుల చెలిమి, నిరంతరం సాటిజీవుల మీద దయ కల్గేటట్లు చేయండి. ఇదే నాకు మీరియ్యవలసిన వరం" అంటాడు భక్తుడు. సంసారం, సంగతులు, సంపదలు, సంతానం అడుగలేదు. ఇది నిజమైన భక్తితత్త్వం. ఇది ఋజువైన సుజ్ఞానమార్గం. దీనిని అనుసరిద్దాం. స్వామి అనుగ్రహానికి పాత్రులమవుదాం.

వార్తలు

(01). 31-08-2018 తేది శ్రీశుకబ్రహ్మాశ్రమం ప్రారంభించినప్పటి నుండి దాదాపు పది సంవత్సరాలు శ్రీశుకబ్రహ్మాశ్రమ అన్నపూర్ణ నిలయానికి – ఆశ్రమానికి అన్ని విధాల సహకరించి ఆశ్రమాభివృద్ధికి త్రికరణశుద్ధిగా పాటుపడిన మాతృశ్రీ సాధు చిన్నమ్మగారి ఆరాధన – రేణిగుంట సమీపం వెదళ్ల చెరువు గ్రామంలోని శ్రీరామకృష్ణ సేవాశ్రమంలోని అమ్మగారి సమాధివద్ద ఘనంగా జరిగినది. పూజ్య శ్రీ విద్యాస్వరూపా నందగిరిస్వాములవారు అందు పాల్గొనినారు. ఆ ఆశ్రమ కమిటీ సభ్యులు శ్రీఎల్.చంద్రశేఖర్ & శ్రీగిరి, శ్రీ మాధవరెడ్డి వగైరా బీదలకు అన్నదానం (మృష్టాన్న భోజనం) చేయడమేగాక నిరుపేద స్త్రీలకు దాదాపు యాభై మందికి చీరలు, పురుషులకు 50 మందికి పంచెలు వితరణ చేసినారు.

(02). శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో రెండవ భాగవత సదస్సు 20-08-2018న ప్రారంభమై 26-08-2018 తేది సాయంకాల ప్రవచనతో ముగిసినది. శ్రీవ్యాసాశ్రమంలో వ్యాసాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యానందగిరిస్వాములవారిచే సన్యాసాశ్రమాన్ని స్వీకరించి కాశీలో వేదాంతచార్య పట్టభద్రులైన పూజ్యశ్రీ పరమాత్మానందగిరి స్వాములవారు రోజూ ఉదయం, సాయంత్రంలలో భాగవతం ద్వితీయ స్కంధంపై శ్రోతలకు హృద్యంగా ప్రవచన చేశారు. చివర శ్రీస్వాములవారికి శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారు, శ్రోతలు ఉచితరీతిగా సత్కరించారు.

(03). 2-09-2018 తేది ఆదివారం రాత్రి (అష్టమి –రోహిణి నక్షత్రంలో) శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శ్రీకృష్ణ పరమాత్మకు షోడశోపచార పూజ లక్ష తులసి పూజ జరిగినది. అందరికి ప్రసాద వితరణ జరిగినది.

(04).(ఎ). 2-09-2018 తేది కృత్తిక సందర్భంగా ప్రదోషకాలంలోశ్రీ సుబ్రహ్మణ్యస్వామి మూర్తికి అభిషేకం, అర్చన చేయబడినవి.

(బి). 8-09-2018 తేది శనివారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ ఆలయంలోని శివునికి ప్రదోషకాలంలో రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(05). 13-09-2018 తేది గురువారం వినాయకచవితి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలోని శివాలయంలో గల వరసిద్ధిగణపతి మూర్తికి అభిషేకాలు, షోడశోపచార పూజ, పత్రిపూజ జరిగినది. భక్తులందరికి ప్రసాద వినియోగం చేయబడింది.

(6). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఆగష్టు నెలలో ఓ.పి విభాగంలో **991** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేశారు. **127** మందికి కళ్లలో పొరలను తొలగించి లెన్సు అమర్చినారు. **11** మందికి యాగ్ లేజర్ చికిత్స చేశారు.